‘పాత’ అందాల్లోకి ప్రయాణమిది!

టైమ్ ట్రావెల్ ఫీచర్ తెచ్చిన గూగుల్

హైదరాబాద్ : ఒక ఐదారు దశాబ్దాల క్రితం నాటి హైదరాబాదో, ఢిల్లీనో చూడాలనుకుంటే పాత చిత్రాల కోసం ఇకపై వెతుక్కోవాల్సిన పనిలేదు. ఇప్పుడు గూగుల్ మ్యాప్స్ అలాంటి సౌకర్యాన్ని కొత్తగా ప్రవేశపెట్టింది. టైమ్ ట్రావెల్ మాదిరిగా పనిచేసే ఈ టూల్ ద్వారా గతంలో ఆయా పట్టణాలు, నగరాలు, ట్రాఫిక్, రవాణా సౌకర్యాలు, వీధులు, పరిసరాలు, నదులు, కొండలు, చెరువులు ఎలా ఉండేవో మనం పాత చిత్రాల ద్వారా స్పష్టంగా తిలకించవచ్చు. ఈ సౌకర్యాన్ని పొందాలంటే గూగుల్ మ్యాప్స్ లేదా గూగుల్ ఎర్త్‌లో మనకు కావాల్సిన ప్రదేశాన్ని వెతకాలి. తర్వాత లేయర్స్ ఆప్షన్‌లోకి వెళ్లి, ‘టైమ్ లేప్స్’ను ఎంచుకోవాలి. మీరు కోరుకున్న కాలానికి, ఇప్పటికీ ఆయా ప్రదేశాల్లో వచ్చిన మార్పులు, తేడాలను చూడవచ్చు. ఈ గూగుల్ టైం ట్రావెల్ ఫీచర్ ద్వారా ప్రపంచంలోని ప్రముఖ నగరాలైన బెర్లిన్, లండన్, ప్యారిస్ లాంటి నగరాలకు చెందిన చిత్రాలను 1930 నుంచి చూడవచ్చు. వివిధ ప్రాంతాలకు సంబంధించిన 28 వేల కోట్ల చిత్రాలను ఇందులో చూసి వర్చువల్ ప్రయాణ అనుభూతిని పొందేలా ఈ ఫీచర్‌ను రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు.

సురక్షితం కాని రోడ్లలో భారత్‌కు 5వ స్థానం

జోహెన్నస్‌బర్గ్: వాహనాల డ్రైవర్లకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర దేశంగా దక్షిణాఫ్రికా వరుసగా రెండవ ఏడాది జాబితాలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. 53 దేశాలలో పరిశోధన చేసిన అమెరికాకు చెందిన డ్రైవర్ ట్రైనింగ్ కంపెనీ తాజా జాబితాను విడుదల చేసింది. డ్రైవర్లకు అత్యంత ప్రమాదకరమైన, సురక్షితం కాని దేశాల జాబితాలో భారత్ 5వ స్థానాన్ని దక్కించుకుంది. అమెరికా భారత్‌ను మించిపోయి 3వ స్థానాన్ని సాధించినట్లు డ్రైవింగ్ కోర్సులను నిర్వహిస్తున్న అంతర్జాతీయ డ్రైవర్ల శిక్షణ కంపెనీ జుటోబీ.కాం వెల్లడించింది. ప్రపంచంలో డ్రైవర్లకు అత్యంత సురక్షిత దేశంగా వరుసగా నాలుగో ఏడాది నార్వే నిలిచింది. సురక్షితం కాని దేశాలలో దక్షిణాఫ్రికా అగ్ర స్థానంలో ఉంది. వాహనాల వేగం, డ్రైవర్లకు బ్లడ్ ఆల్కహాల్ కాన్సెంట్రేషన్ లిమిట్స్, రోడ్డు ట్రాఫిక్ మరణాల సంఖ్య తదితర సూచికల ఆధారంగా జుటోబీ.కాం ర్యాంకింగ్‌లు ఇస్తోంది.

ఉప్పు నీటిలో కరిగే ప్లాస్టిక్

జపాన్ శాస్త్రవేత్తల విజయం

టోక్యో: జపాన్ శాస్త్రవేత్తలు కొత్త రకం ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేశారు. దీనిని ఉపయోగించుకునే సమయంలో అది దృఢంగానే ఉంటుంది. కానీ అవసరం తీరిపోయిన తర్వాత దానిని ఉప్పు నీటిలో వేస్తే, వేగంగా కరిగిపోతుంది. హానికరం కానటువంటి మిశ్రమాలుగా విడిపోతుంది. దీని ప్రభావం పర్యావరణంపై తక్కువగా ఉంటుంది. ఆర్‌వికేఈఎన్ సెంటర్ ఫర్ ఎమర్జెంట్ మాటర్ సైన్స్‌లోని రీసెర్చర్ టకుజో అయిడా నేతృత్వంలోని బృందం ఈ ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేసింది. భూమిలో కాని, నీటిలో కాని కరగని ప్లాస్టిక్స్‌తో ఏర్పడుతున్న సమస్యను పరిష్కరించడం కోసం ఈ బృందం సుప్రా మాలిక్యులర్ ప్లాస్టిక్స్‌తో ప్రయోగాలు చేసింది. క్రాస్-లింక్డ్ సాల్ట్ బ్రిడ్జెస్‌గా ఏర్పడే రెండు అయానిక్ మోనోమర్స్‌ను కలిపింది. రెండు మోనోమర్లను మిశ్రమం చేయడం ద్వారా ఈ కొత్త ప్లాస్టిక్స్‌ను అభివృద్ధి చేశారు.

భూ ప్రకోపం | తీరని శాపం

- భూ అంతర్భాగంలో కదలికల ఫలితంగా భూకంపాలు
- మనుషుల నిర్మాణ చర్యలూ భూ ప్రకంపనలకు కారణమే
- ఎక్కువ ముప్పు ఉన్న దేశాల్లో ఏడో స్థానంలో భారతావని
- అప్రమత్తతతోనే ప్రాణాలకు రక్షణ

మయన్మార్‌లో భూకంప తీవ్రతకు దెబ్బతిన్న ఇండ్లు

న్యూఢిల్లీ: మయన్మార్, బ్యాంకాక్‌లో సంభవించిన తాజా భూకంపం ప్రపంచ దేశాల ప్రజలను గగుర్పాటుకు గురి చేసింది. ప్రకృతి విపత్తుల్లో భయంకరమైన భూకంపాలు శతాబ్దాలుగా మానవాళిపై పెను ప్రభావాన్ని చూపి తీరని ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూకంపాలు కలిగే విధానం, వాటికి గల కారణాలు, వాటి చరిత్ర తెలుసుకోవడం మనందరికీ అవసరం. భూమి ఉపరితలంలోని రాతి పొరలో అత్యంత పెద్దవైన, దృఢమైన పలకలు (టెక్టోనిక్ ప్లేట్స్) ఉంటాయి. ఇవి ఎల్లప్పుడూ నెమ్మదిగా కదులుతూ ఉంటాయి. వీటి మధ్య చీలికలు, భారీ ఖాళీ ప్రదేశాలు కూడా ఉంటాయి. వీటి మధ్య ఘర్షణ వల్ల ఒక పలక మరో పలకను ఢీకొట్టి, కదలకుండా నిలిచిపోతాయి. ఈ పలకలు అకస్మాత్తుగా ఖాళీ ప్రదేశం వైపు దూసుకెళ్లినపుడు భూకంపాలు వస్తాయి. హఠాత్తుగా శక్తి విడుదలవడం వల్ల భూకంప తరంగాలు ఏర్పడతాయి. తద్వారా భూమి కంపిస్తుంది.

కారణాలు అనేకం

అగ్ని పర్వతాల పేలుడు, మహా సముద్రాలు, సరస్సుల కార్యకలాపాలు; గనుల తవ్వకం, సబ్‌వేల నిర్మాణం, ఇతర భూగర్భ పేలుళ్లు వంటివి కూడా భూకంప తరంగాలకు కారణమవుతాయి. అణ్వాయుధ వార్‌హెడ్స్ పేలుడు వల్ల కూడా భూకంపం వంటి తరంగాలు ఏర్పడతాయి.

భారత్ పరిస్థితి ఏమిటి?

అనేక టెక్టోనిక్ ప్లేట్స్ ఏక కేంద్రాభిముఖంగా కదులుతున్న చోట భారత దేశం ఉంది. ఈ భౌగోళిక పరిస్థితుల వల్ల భూకంపాలు పొంచి ఉన్న దేశంగా భారత దేశం మారింది. దీనికి తోడు జనాభా వేగంగా పెరుగుతుండటం, క్రమబద్ధం కాని రీతిలో భవన నిర్మాణాలు విస్తృతంగా జరుగుతుండటం సమస్యను పెంచుతున్నాయి. భూకంపాలు పొంచి ఉన్న దేశాల్లో ప్రపంచంలో ఏడో స్థానంలో భారత్ నిలిచింది. ndma.gov.in ప్రకారం, దేశంలోని 59 శాతం భూభాగం ఓ మోస్తరు నుంచి తీవ్రమైన భూకంప సంఘటనల ముప్పు ప్రభావంలో ఉంది. యావత్తు హిమాలయాల ప్రాంతానికి భూకంప లేఖినిపై 8.0 తీవ్రతకుపైగా శక్తిమంతమైన భూకంపాల ముప్పు ఉంది.

అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం, ప్రపంచ చరిత్రలో 1900వ సంవత్సరం నుంచి 5 భారీ భూకంపాలు :

- **1.వాల్డీవియన్ భూకంపం**

9.5 తీవ్రతతో1960 మే 22న సంభవించింది. చిలీ తీరంలో వచ్చిన ఈ భూకంపం వల్ల 1,655 మంది మరణించారు.

- **2. గ్రేట్ అలస్కా భూకంపం**

1964 మార్చి 28న దక్షిణ అలస్కాలో 9.2 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపంలో 131 మంది మరణించారు.

- **3.సుమత్రా-అండమాన్ దీవుల్లో భూకంపం**

2004 డిసెంబరు 26న 9.1 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం, సునామీలో ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల్లో 2,83,000 మందికిపైగా మరణించారు.

- **4.జపాన్ భూకంపం, సునామీ**

2011 మార్చి 11న 9.1 తీవ్రతతో దిగ్రేట్ టోహోకు భూకంపం సంభవించింది. 18 వేల మందికిపైగా మరణించారు, 6 వేల మందికిపైగా గాయపడ్డారు.

- **5.కచ్‌చట్కా రష్యా భూకంపం**

1952 నవంబర్ 4న 9.0 తీవ్రతతో భూకంపం, సునామీ కారణంగా 4 వేల మంది మరణించారు.

భూకంపాల నుంచి ప్రాణ రక్షణ ఎలా?

భూకంపం వచ్చినపుడు ఆందోళనకు గురి కాకూడదు. ప్రశాంతంగా ఉండాలి. పరుగులు తీయకూడదు. ప్రకంపనలు ఆగిపోయే వరకు వేచిచూడాలి. పై అంతస్థుల్లో ఉన్నవారు క్రిందికి అంతస్థుకు వచ్చి, గట్టి టేబుల్ లేదా డెస్క్ క్రింద ఉండాలి. భూకంపం సమయంలో కాని, ఆ తర్వాత కాని వదంతులను ప్రచారం చేయకూడదు.

334 అణు బాంబుల విధ్వంసంతో సమానం

నైపేయీ, మార్చి 30: మయన్మార్‌తో పాటు థాయ్‌లాండ్‌లో ఈ నెల 28న 12 నిమిషాల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణు బాంబులతో సమానమైన శక్తిని విడుదల చేసి వినాశనాన్ని సృష్టించిందని స్థానిక భూ విజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని భూప్రకంపనలు వచ్చే అవకాశముందని ఆమె హెచ్చరించారు.ప్రస్తుత విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10 వేలు దాటే అవకాశముందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేస్తున్నది.

మళ్లీ భూకంపం

మయన్మార్‌లో ఆదివారం మళ్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.1గా నమోదైంది. దాంతో ఇండ్ల నుంచి ప్రజలు భయంతో బయటికి పరుగులు తీశారు. దేశంలోని రెండో అతిపెద్ద నగరమైన మాండలే సమీపంలో ఈ భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే నివేదించింది. వెంటనే స్పందించిన సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. భారీ భూకంపం వల్ల రోడ్లు, వంతెనలు, సమాచార వ్యవస్థ దెబ్బతినటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

విపత్తు వేళ..వైమానిక దాడులా?

మయన్మార్‌ను పాలిస్తున్న జుంటా నేతృత్వంలోని మిలటరీ సర్కార్, భూకంపం సంభవించిన శుక్రవారం నాడు కూడా తిరుగుబాటు దళాల స్థావరాలపై వైమానిక దాడులు చేపట్టిందని తెలిసింది. షాన్ రాష్ట్రంలో నాన్‌క్సోలో జరిగిన వైమానిక దాడుల్లో ఏడుగురు చనిపోయారని అంతర్జాతీయ మీడియా తెలిపింది.

షిర్డీ దర్శించే భక్తులకు రూ.5 లక్షల బీమా!

ముంబై, మార్చి 30 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని షిర్డీలో కొలువైన సాయిబాబా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఐదు లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించాలని సాయి సంస్థాన్ నిర్ణయం తీసుకుంది. ఈ బీమా రక్షణను పొందాలనుకొనేవారు దర్శనానికి వచ్చే ముందు సాయి సంస్థాన్ అధికారిక వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు సాయి సంస్థాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గోరక్ష్ గాడిల్కర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొంటే సాయిబాబా దర్శనం కోసం మాత్రమే వారు వస్తున్నట్లు గుర్తించడానికి సహాయపడుతుందని ఆయన చెప్పారు.

పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

ఒకరి మృతి..

25 మందికి గాయాలు

న్యూఢిల్లీ, మార్చి 30: బెంగళూరు నుంచి గువహటి వెళ్తున్న కామాఖ్య ఏసీ సూపర్‌ఫాస్ట్ రైలు ఆదివారం ప్రమాదానికి గురైంది. ఒడిశాలో కటక్-నెర్గుండి స్టేషన్ల మధ్య ఈ రైలు పట్టాలు తప్పింది. మొత్తం 11 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందారు. రైలు వేగం తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్టు తెలుస్తున్నది. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో 25 మంది ప్రయాణికులకు గాయాలైనట్టు రైల్వే డీఎం దత్తాత్రేయ షిండే వెల్లడించారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నదని చెప్పారు.

రూ.944 కోట్ల జరిమానా

ఇండిగోకు ఐటీ శాఖ నోటీస్

న్యూఢిల్లీ, మార్చి 30: భారత్‌లోని అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగోకు ఆదాయపు పన్ను శాఖ షాకిచ్చింది. ఈ సంస్థకు ఆ శాఖ రూ.944.20 కోట్ల జరిమానా విధించింది. కాగా, ఐటీ శాఖ జరిమానా విధింపును తప్పుడు, పనికిమాలిన చర్యగా ఇండిగో యాజమాన్యం పేర్కొంది. దీనిని న్యాయపరంగా ఎదుర్కొంటామని వెల్లడించింది. జరిమానా ఉత్తర్వు ఇండిగో మాతృ సంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్‌కు శనివారం అందింది. ఈ జరిమానా 2021-22 మదింపు సంవత్సరానిదని ఆ సంస్థ వెల్లడించింది. ఈ జరిమానా చట్టంలోని నిబంధనల ప్రకారం విధించినది కాదని పేర్కొంది. కాగా, ఇప్పటికే ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సంస్థకు ఐటీ శాఖ నోటీసు ఇబ్బంది కలిగించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

పుతిన్ లగ్జరీ కారులో పేలుడు

హత్యాయత్నంపై అనుమానాలు

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారిక కార్లలోని లిమోజిన్ లగ్జరీ కారులో పేలుడు సంభవించింది. దీంతో ఆయనపై హత్యాయత్నం జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎఫ్ఎస్‌బీ ప్రధాన కార్యాలయానికి సమీపంలోనే, ఓ వీధిలో జరిగిన ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదు. పేలుడు సంభవించిన వెంటనే మంటలు చెలరేగాయి. ఈ పేలుడుకు కారణాలపై క్రెమ్లిన్ దర్యాప్తు చేస్తున్నది. ఈ కారు విలువ 3,55,796 డాలర్లు (సుమారు 3 కోట్లు). ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, ఈ కారు ఇంజిన్ నుంచి మొదట మంటలు వచ్చాయి. ఆ తర్వాత కారులోని ఇతర భాగాలకు వ్యాపించాయి. అక్కడికి సమీపంలోని రెస్టారెంట్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

తిష్ఠ వేసినోళ్లకి బదిలీ అవసరం

మంత్రిత్వ శాఖల్లో అవినీతిపై పార్లమెంటరీ ప్యానెల్ సూచన

న్యూఢిల్లీ, మార్చి 30: కొన్ని మంత్రిత్వ శాఖల్లో ఎన్నో ఏండ్లుగా తిష్ఠ వేసి ఉన్న అధికారులకు స్థాన చలనం కల్పించాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ ప్యానెల్ అభిప్రాయపడింది. ‘ఒకే మంత్రిత్వ శాఖలో చాలా సంవత్సరాలుగా కొందరు అధికారులు పాతుకుపోయి ఉండటం వల్ల అది అవినీతి, అక్రమాలకు దారి తీసే అవకాశం ఉంది. నిర్దేశిత సమయాన్ని మించి ఏ అధికారిని కూడా అక్కడ ఉంచకుండా తగిన చర్యలు చేపట్టాలి’ అని ప్యానెల్ సూచించింది.

సమస్యల సుడి గుండంలో వజ్రాల కార్మికులు

జీతాలు పెరగక ఇబ్బందులు

బీజేపీ పాలిత గుజరాత్‌లో దుస్థితి

సూరత్: బీజేపీ పాలిత గుజరాత్‌లో లక్షలాది మంది వజ్రాల పరిశ్రమ కార్మికులు సమస్యల సుడి గుండంలో అల్లాడిపోతున్నారు. వజ్రాల ప్రాసెసింగ్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సూరత్‌లో దాదాపు 2,500 యూనిట్లలో సుమారు 10 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రపంచంలో దాదాపు 90 శాతం ముడి వజ్రాల కటింగ్, పాలిషింగ్ ఇక్కడే జరుగుతాయి. డిమాండ్లను పరిష్కరించాలంటూ వందలాది మంది కార్మికులు ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. డైమండ్ వర్కర్స్ యూనియన్ గుజరాత్ ఉపాధ్యక్షుడు భవేష్ టంక్ మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి వజ్రాల పరిశ్రమ మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నదని, కార్మికులకు సరైన పని, వేతనాలు ఉండటం లేదని చెప్పారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తమ సమస్యలను సీఎం భూపేంద్ర పటేల్‌కు విన్నవించామని అన్నారు.

క్షమించండి.. ఆ సీన్లు తొలగిస్తున్నాం

ఎల్ 2 ఎంపురాన్ వివాదంపై నటుడు మోహన్‌లాల్

న్యూఢిల్లీ, మార్చి 30: ఇటీవల విడుదలైన తన తాజా చిత్రం ఎల్2 ఎంపురాన్‌పై ఏర్పడిన వివాదంపై మలయాళ సూపర్‌స్టార్, హీరో మోహన్‌లాల్ క్షమాపణ చెప్పారు. వివాదానికి కారణంగా భావిస్తున్న గుజరాత్ అల్లర్లను పోలి ఉన్న కొన్ని సీన్లను తొలగించడానికి తన చిత్ర బృందం నిర్ణయించిందని చెప్పారు. ఈ మేరకు మోహన్‌లాల్ ఫేస్‌బుక్ పోస్ట్‌ను నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ షేర్ చేశారు. చిత్రంలో ఉన్న కొన్ని రాజకీయ-సామాజిక ఇతివృత్తాలు నా అభిమానులు చాలా మందిని నిరాశపరిచినట్టు తెలుసుకున్నా. నా సినిమాలు ఏ రాజకీయ ఉద్యమాన్ని, మతాన్ని, భావజాలాన్ని కించపర్చకుండా చూడటం నటుడిగా నా బాధ్యత. జరిగిన దానికి హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతూ దృశ్యాలను తొలగిస్తున్నాం.’ అని మోహన్‌లాల్ పేర్కొన్నారు.

డంకీ రూట్‌లో తగ్గిన భారతీయులు

కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ అడ్మినిస్ట్రేషన్.. అక్రమ వలసదారులకు భారీ కష్టాలు

వాషింగ్టన్: భారత దేశం నుంచి డంకీ రూట్‌లో అమెరికాకు వెళ్లే అక్రమ వలసదారులు మునుపెన్నడూ లేనన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. అమెరికాలో చట్టవిరుద్ధ వలసదారుల సంఖ్యను తగ్గించాలని డొనాల్డ్ ట్రంప్ పట్టుదలతో ఉండటమే దీనికి కారణం. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సమాచారం ప్రకారం, అరెస్టయిన చట్టవిరుద్ధ భారతీయ వలసదారుల సంఖ్య నిరుడు డిసెంబరులో 5,600. ఈ సంఖ్య ఈ సంవత్సరం జనవరిలో 3,132; ఫిబ్రవరిలో 1,628. ఈ ఏడాది జనవరి 20న దేశాధ్యక్ష పదవిని చేపట్టిన ట్రంప్ అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తుండటంతో స్మగ్లర్లు కూడా వారిని డంకీ రూట్‌లో తీసుకెళ్లడంపై పవెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారులు, వారి పిల్లలు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఇటీవల మిలిటరీ విమానాల్లో సంకెళ్లు వేసి మరీ అక్రమ వలసదారులను భారత దేశానికి పంపించడంతో, వీరంతా క్షణ క్షణం భయం భయంగా గడుపుతున్నారు. అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు తిరిగి పంపించే ఏర్పాట్లు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉందని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

మణిపూర్ అంతటికీ సాయుధ దళాల చట్టం

ఆరు నెలల పాటు పొడిగింపు

న్యూఢిల్లీ: మణిపూర్ రాష్ట్రవ్యాప్తంగా సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్పీఏ) మరో ఆరు నెలలపాటు పొడిగించినట్లు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. రాష్ట్రంలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిని ఈ చట్టం నుంచి మినహాయించినట్లు తెలిపింది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కల్లోలిత ప్రాంతాల్లో పనిచేసే సాయుధ దళాల సిబ్బందిపై ఆరోపణలు వచ్చినప్పుడు, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేనిదే విచారణ జరపరాదని ఈ చట్టం చెప్తున్నది. ఈ చట్టాన్ని నాగాలాండ్‌లోని 8 జిల్లాలకు, మరో ఐదు జిల్లాల్లోని 21 పోలీస్ స్టేషన్ల పరిధులకు మరో ఆరు నెలలు పొడిగించినట్లు హోం శాఖ తెలిపింది. అదే విధంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని తిరప్, చాంగ్లాంగ్, లాంగ్‌డింగ్ జిల్లాలకు, నమ్‌సాయ్ జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్లకు కూడా ఈ చట్టం అమలును ఆరు నెలలపాటు పొడిగించినట్లు ఈ నోటిఫికేషన్ వెల్లడించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. ఈ చట్టం అమల్లో ఉంటే, గాలింపు, అరెస్ట్, కాల్పులు జరపడానికి భద్రతా సిబ్బందికి సంపూర్ణ అధికారాలు లభిస్తాయి.

ఆదివారం బీజాపూర్‌లో పోలీసుల ఎదుట లొంగిపోయిన నక్సలైట్లు

50 మంది నక్సలైట్ల లొంగుబాటు

వారిలో 14 మందిపై రూ.68 లక్షల రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 30: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కరడు గట్టిన మావోయిస్టులు సైతం ఉన్నారు. ప్రధాని మోదీ ఛత్తీస్‌గఢ్ పర్యటనకు కొన్ని గంటల ముందు ఈ పరిణామం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రయాదవ్ ఆదివారం వెల్లడించారు. బీజాపూర్ జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న ‘నియద్ నెల్లనార్’ కార్యక్రమానికి ఆకర్షితులైన మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఆపరేషన్లతో మావోయిస్టులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వారు తమ పార్టీ సిద్ధాంతాలపైనా అసంతృప్తికి లోనై, ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వస్తున్నారని తెలిపారు. లొంగిపోయిన వారిలో 14 మందిపై మొత్తం రూ.68 లక్షల రివార్డు ఉన్నట్టు ఆయన వెల్లడించారు. లొంగిపోయిన నక్సలైట్లలో మావోయిస్ట్ అగ్రనేత హిడ్మాకు అనుసంధానంగా ఉన్న బెటాలియన్లకు చెందిన వారున్నారని చెప్పారు. నక్సల్స్ లొంగుబాటును కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వాగతించారు.

డిజిటైజేషన్ కాదు.. సంస్థాగత వసూలు

ఏటీఎం చార్జీలపై మండిపడ్డ స్టాలిన్

చెన్నై: ఏటీఎంల నుంచి నెలవారీ పరిమితికి మించి జరిపే నగదు ఉపసంహరణలపై చార్జీలు విధించేందుకు బ్యాంకులను అనుమతిస్తూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తప్పుపట్టారు. ఇది డిజిటైజేషన్ కాదని, ప్రజల నుంచి సంస్థాగతంగా డబ్బును వసూలు చేసుకోవడమని విమర్శించారు. దీనివల్ల ప్రజలు తమకు అవసరమైన దానికంటే ఎక్కువ నగదును ఉపసంహరించుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరవాలని కోరిన కేంద్ర ప్రభుత్వం.. డిజిటల్ లావాదేవీలపై చార్జీలు, బ్యాంకు ఖాతాల్లో తక్కువ బ్యాలెన్స్ ఉన్నవారికి జరిమానాలు విధిస్తున్నదని, మరోవైపు ఏటీఎంల నుంచి నెలవారీ పరిమితికి మించి జరిపే నగదు ఉపసంహరణలపై బ్యాంకులు రూ.23 వరకు చార్జి విధించేందుకు రిజర్వ్ బ్యాంకు అనుమతించిందని స్టాలిన్ ధ్వజమెత్తారు.

భారత్ వృద్ధి రేటు 6.5 శాతం!

- **2025-26కు ఈవై ఎకానమీ వాచ్ అంచనా**
- **విద్య, ఆరోగ్యంపై ఖర్చు పెంచాలని సూచన**

న్యూఢిల్లీ: ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో భారత దేశం 6.5 శాతం రేటుతో వృద్ధి సాధించే అవకాశం ఉందని ఈవై ఎకానమీ వాచ్ అంచనా వేసింది. ప్రభుత్వ నిధులను వివేకంతో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, మానవ మూలధన అభివృద్ధికి సహకరించే స్పష్టమైన ఆర్థిక వ్యూహాలను అమలు చేస్తే, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు పెరుగుతాయని ఆ సంస్థ తెలిపింది. 2024 ఏప్రిల్- 2025 మార్చి మధ్య కాలంలో భారత దేశ వాస్తవ జీడీపీ వృద్ధి 6.4 శాతమని ఈవై ఎకానమీ వాచ్ మార్చి ఎడిషన్ వెల్లడించింది. తదుపరి సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి చెందుతుందని తెలిపింది. రానున్న రెండు దశాబ్దాల్లో భారత దేశం సాధారణ ప్రభుత్వ విద్య, ఆరోగ్య రంగాల్లో వ్యయాలను క్రమంగా పెంచాల్సి ఉంటుందని చెప్పింది. అధిక ఆదాయం గల దేశాలు చేసే వ్యయాలకు దగ్గరగా భారత్ కూడా ఖర్చు చేయవలసిన అవసరం ఉంటుందని వివరించింది. విద్యా రంగంలో ప్రస్తుతం ప్రభుత్వ వ్యయం జీడీపీలో 4.6 శాతం ఉందని 2047-48 ఆర్థిక సంవత్సరానాటికి దీనిని 6.5 శాతానికి పెంచాలని సూచించింది. దేశ జనాభాలో యువత సంఖ్య, పని చేసే సామర్థ్యం గలవారి అవసరం పెరుగుతుండటాన్ని బట్టి ఈ పెరుగుదల అవసరమని తెలిపింది. 2020-21లో ఆరోగ్య రంగంపై జీడీపీలో 1.1 శాతం ఖర్చు చేశారని, 2047-48 ఆర్థిక సంవత్సరం నాటికి దీనిని 3.8 శాతానికి పెంచాలని పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ సేవల మెరుగుదల, సత్వలితాల కోసం ఈ ఖర్చు అవసరమని వివరించింది. ఎక్కువ మంది యువత, తక్కువ ఆదాయం గల రాష్ట్రాలకు విద్య, ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగినట్లుగా అదనపు నిధులను అందజేయాలని తెలిపింది. దశలవారీగా ఆర్థిక పునర్నిర్మాణం చేయడం వల్ల ఈ లక్ష్యాలను సాధించవచ్చునని, వృద్ధితో రాజీ పడాల్సిన అవసరం లేదని చెప్పింది.

చిట్టి చీమలు.. పెద్ద మిత్రులు!

- *మన ఇండ్లలో చెత్తను శుభ్రం చేసే సహాయకారులవి*
- *ఎక్కువ సంఖ్యలో వస్తేనే మనుషులకు ఇబ్బందులు*
- *వాటిని చంపకుండా వదిలివేయాలని శాస్త్రవేత్తల సూచన*

సిడ్నీ, మార్చి 30: ప్రకృతిలోని గొప్ప శ్రమ జీవుల గురించి ప్రస్తావించాలంటే అందులో చీమలకు తప్పక స్థానం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా 22 వేల రకాల చీమ జాతులుండగా, అందులో ఉష్ణమండల ఆస్ట్రేలియాలోనే 5 వేల రకాలుంటాయని అంచనా. కొంతమంది చీమలంటే భయపడతారు, వాటిని చంపాలని చూస్తారు. అయితే వాస్తవానికి అవి పర్యావరణానికి, మానవాళికి సాయం చేసేవే తప్ప హానికరమైనవి కావని జీవ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు చీమలు మన ఇండ్లలో తరచూ ఎలా దర్శనమిస్తాయి? ఎంతో ఎత్తయిన అపార్ట్‌మెంట్లలో కూడా అవి ఎలా చొరబడతాయి? అవి ఇళ్లలోకి రాకుండా ఏం చేయాలో తెలుసుకోవడం అవసరమని పరిశోధకులు చెప్తున్నారు. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఈ ప్రపంచంలో ప్రతి ఒక్క మనిషికి 25 లక్షలు చొప్పున చీమలు ఉన్నాయి.

**ఇండ్లల